క్లుప్తంగా

జోరుగా ఉపాధి పనులు

నందవరం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. జాబ్ కార్డు ఉన్న కూలీలకు అధికారులు అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ పనులు ముగియడంతో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి పనుల బాట పట్టారు. ప్రభుత్వం ఉపాధి కూలి రూ.300కు పెంచడంతో అధిక సంఖ్యలో పనులకు వస్తున్నారు. చెక్‌డ్యాంలు, చెరువులు, కాలువల్లో పూడికతీత వంటి పనులు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. నందవరం మండలం ధర్మపురానికి చెందిన బోయ నడిపి రంగన్న బైక్‌పై కర్ణాటక మద్యం తలిరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. 192 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ఆదోని ఆవోపాకు అవార్డు

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (ఆవోపా) ఆదోని యూనిట్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. పట్టణ ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు మమతాశ్రీ, కార్యదర్శులు సంగీత, బిందులకు రాష్ట్ర మహిళా విభాగ్ చైర్మన్ అరవేటి నిర్మల చేతులమీదుగా అవార్డుతో పాటు బంగారు పతకాన్ని అందజేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలులోని మౌర్య ఇన్ ఫంక్షన్ హాల్‌లో ఆవోపా రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సభ జరిగింది. 2023–24లో ఆదోని ఆవోపా మహిళా విభాగం 78 ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించడంతో రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందని పట్టణ మహిళా విభాగ్ అధ్యక్షురాలు మమతాశ్రీ తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ఐదుగురు వార్డు వలంటీర్లు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. 13వ వార్డు పరిధిలో జిలాన్‌బాషా, విష్ణుచరణ్, యల్లమ్మ, శ్యామల, రాజు రాజీనామా చేస్తూ పత్రాలను వార్డు అడ్మిన్‌లకు అందజేశారు. రాజీనామాల ఆమోదం కోసం కమిషనర్ రామచంద్రారెడ్డికి సిఫారసు చేసినట్లు అడ్మిన్‌లు తెలిపారు.

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలి గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు విధులకు రాజీనామ చేశారు. వీరి రాజీనామ పత్రాలను ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


ఆంజనేయులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్ పరిధిలోని ఆస్పరి–మొలగవల్లి ఆర్‌ఎస్ లైన్ మధ్య కిలోమీటర్ నంబర్ 478/18 డౌన్ లైన్ ట్రాక్ మధ్య ఆంజనేయులు (35) అనే వ్యక్తి సోమవారం కేపీసీసీ రన్నింగ్ గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సర్వేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఆదోని పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన ఆంజనేయులుగా గుర్తించామన్నారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని చెప్పారు.మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తాగుబోతు మాటలేంటి బాబు


మాట్లాడుతున్న ఏకాంబర్ రెడ్డి

కౌతాళం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాగుబోతు మాదిరిగా చిల్లరగా మాట్లాడి విలువ పోగొట్టుకున్నారని కౌతాళం వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆదివారం మంత్రాలయం రోడ్‌షోలో చంద్రబాబు వ్యాఖ్యలపై వారు స్పందించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, నాయకులు మహేందర్‌రెడ్డి, ఏకాంబర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్ ధరలు పెరిగాయని జనాలను రెచ్చగొడుతున్నారని, వీటికి రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేని విషయం చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నావు కదా ఈ విషయాన్ని అక్కడే అడుగు అని ఎద్దేవా చేశారు. 25 ఏళ్లుగా చంద్రబాబు ఎమ్మెల్యేగా ఉన్న కుప్పంలో అభివృద్ధి జరిగిందో లేక మంత్రాలయంలో అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. మద్యం విధానంపై తప్పుడు ఆరోపణలు చేశారని, ఇకనైనా స్థాయికి తగ్గట్టు మాట్లాడాలని హితవుపలికారు. నాయకులు అబ్దుల్‌సమద్, బసవధని, లక్ష్మిరెడ్డి, వడ్డెరాము, మరేగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త


ప్రచారంలో పాల్గొన్న బి.మమత

ఆదోని సెంట్రల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ఓ అంగన్‌వాడీ కార్యకర్త సోమవారం ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి పార్థసారధి 42వ వార్డు వాల్మీకి నగర్‌లో ప్రచారం చేపట్టగా ఇస్వీ గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త బి.మమత పాల్గొంది. ఘటనపై సీడీపీఓ ఉమామహేశ్వరమ్మను వివరణ కోరగా.. ప్రచార సమయంలో ఆమె అక్కడ ఎందుకు ఉంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రచారంలో పాల్గొందా? విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం


వెంకటగిరి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. ఆమె సోమవారం మండల పరిధిలోని వెంకటగిరి, నక్కలమిట్ట, పరమాన్‌దొడ్డి, బనవాసిఫారం, కోటేకల్, చెన్నాపురం, బోడబండ, దేవబెట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో కచ్చితంగా అమలు చేసే పథకాలను మాత్రమే పేర్కొన్నారని, మాటిస్తే నేరవేరుస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని నాటి కష్టాలను గుర్తుచేశారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ అందిస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డి విన్నవించారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలపై గతంలో రాష్ట్రాన్ని మరో శ్రీలంకగా మారుస్తున్నారని ఎద్దేవా చేసిన చంద్రబాబు ఇప్పుడు అంతకుమించి హామీలు ఇచ్చారని, ఈ పథకాలన్నీ ఎలా అమలుచేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగు నరసన్న, రామాంజనేయులు, రంగన్న, గోవిందు, హనుమంతు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరగా బుట్టా రేణుక, బీఆర్.బసిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ర్యాలీలో ఆయా గ్రామాల నాయకులు నల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, భీమిరెడ్డి, జాలవాడి లక్ష్మీ, నరసింహులు, సుశీలమ్మ, వెంకట్రామిరెడ్డి, జాలవాడి లక్ష్మన్న, బజారి, మహానంది, తిక్కయ్య, గోవిందరాజు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


పరమాన్‌దొడ్డిలో బుట్టా రేణుక సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

ప్రైవేటు టీచర్ల సంక్షేమానికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు, అధ్యాపకుల సంక్షేమం సీఎం వైఎస్ జగనన్నతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల (పీఎల్‌టీయూ) ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్ల సమస్యలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిష్కారానికి చర్యలు తీసుకొని జీఓ జారీ చేశారన్నారు. ఆయా ఉపాధ్యాయులకు 12 నెలల పాటు వేతనాలు ఇచ్చేలా జీఓ విడుదల చేసినా యాజమాన్యాలు పట్టించుకోకపోవడాన్ని సంఘ సభ్యులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. అడ్మిషన్లు చేయించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నారని ఎన్నికల అనంతరం ఆయా యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకొనేందుకు అందరి సహకారం అవసరమన్నారు. అలాగే తనకు మద్దతు ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రైవేట్ టీచర్లు సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యునియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్: పలువురు టీడీపీ నాయకులు సోమవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎంపీటీసీ చిలక గిడ్డయ్య సమక్షంలో చిన్న ఆదెప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్ ఆచారి తదితరులు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మెచ్చి పార్టీలోకి చేరుతున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

వైభవంగా రథోత్సవం


అశేష భక్తజనం నడుమ భీమరాయస్వామి రథోత్సవం

పెద్దకడబూరు: మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో భక్తుల ఇలవేల్పు భీమరాయస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగరాజుస్వామి ఉదయం గణపతి పూజ, లింగార్చన, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, మహా మంగళహారతులు చేపట్టారు. సాయంత్రం గంగా నాగప్ప తాత ఇంటి నుంచి ఉత్సవ మూర్తిని గుడి దగ్గరికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచారు. గుమ్మడికాయతో బలిదానం, మహా మంగళహారతి అనంతరం భక్తుల శ్రీరామ నామస్మరణ మధ్య రథోత్సవం ముందుకు సాగింది. రథాన్ని బసవన్న కట్ట వద్దకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో సోమవారం ఆంజనేయ స్వామి దేవాలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశేష భక్తజనుల మధ్య ప్రతిష్టాపన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చంద్రబాబు హామీలు నీటి బుడగలు

కౌతాళం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నీటి మీద బుడగలాంటివని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య అన్నారు. ఆయన సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. వలసలు నివారిస్తాను, రైతులను ఆదుకుంటాను, వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఇప్పుడు ఏ రకంగా అభివృద్ధి చేస్తారని నిలదీశారు. ఎల్లెల్సీకి నీటి వాటా 750 క్యూసెక్కుల నీరు వస్తేనే సాగునీరు అందడం ద్వారా వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని వలసలు తగ్గుతాయన్నారు. తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మిస్తే నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందన్నారు. కోసిగిలో పులికనుమ చెరువుకు తూము ఏర్పాటు చేయాలని, చిన్నతుంబళం చెరువును ఆధునికీకరించాలని వీటిపై చంద్రబాబు ఒక్క మాట కూడ మాట్లాడలేదని ఎద్దేవా చేశారు. కౌతాళంలో ఆయన అమలుచేయలేని హామీలు ఇచ్చి వెళ్లారని విమర్శించారు. మతతత్వ బీజేపీకి అనుకూలంగా ఉన్న టీడీపీ, జనసేనను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు

మంత్రాలయం: నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి వై.బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సోదరుడు టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి కోరారు. ఆయన సోమవారం స్థానిక రామచంద్ర నగర్‌లో గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గత చంద్రబాబు పాలన, ప్రస్తుత జగనన్న పాలనలో తేడాను వివరించి ఓటు అభ్యర్థించారు. పార్టీ నాయకులు భీమా రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, శివన్న, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: బదినేహాల్‌లో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమార్తె ప్రియాంక రెడ్డి, కోడలు అనూష రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు.నాయకులు ప్రహ్లాదచారి, మహబుబ్‌సాబ్, వీరభద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న వై.సీతారామిరెడ్డి

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి


గంజిహళ్లిలో వృద్ధురాలికి నమస్కరిస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం ఆమె తనయుడు బుట్టా ప్రతుల్, కోడలు సాహితీ గంజిహళ్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని ప్రజలు గమనించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. నాయకులు తిరుమల రెడ్డి, బందెనవాజ్, మన్సూర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు


కడిమెట్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఎర్రకోట జగన్


ఎమ్మిగనూరురూరల్: వైఎస్సార్‌సీపీ విజయాన్ని అపడం ఎవరి తరం కాదని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం కడిమెట్ల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ఆయన్ను మరోసారి అఖండ మెజార్టీతో గెలిపిస్తాయని చెప్పారు. అన్నివర్గాలకు మేలు చూకూరేలా పథకాలను మేనిఫెస్టోలో పొందుపరిచారని తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా బుట్టా రేణుకను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ కేశన్న, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి చిరునామా వైఎస్ జగన్

కౌతాళం: ఐదేళ్ల సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాభివృద్ధికి చిరునామాగా మారారని ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజు గౌడ్ అన్నారు.ఆయన సోమవారం ఉరుకుంద గ్రామంలో రెండవ రోజు ప్రచారం కొనసాగించారు. గ్రామ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ రాజ్యాన్ని స్థాపించాలని కోరారు. సంక్షేమావృద్ధి కొనసాగాలంటే సీఎంగా జగనన్నను, మంత్రాలయంలో నాలుగోసారి ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డిని గెలపించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే కుటుంబసభ్యుల ప్రచారం

ఆదోని టౌన్: ఆదోని ఎమ్మెల్యేగా సాయిప్రసాద్ రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరుతూ కుటుంబసభ్యులు విస్తృత ప్రచారం చేపట్టారు. 30, 31 వార్డుల పరిధిలో గుండ్లసా దర్గా, బుడ్డేకల్, వడ్డేగేరి, ఆటో స్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి హిరణ్మయి రెడ్డి, కుమార్తెలు గౌతమిరెడ్డి, మనోవిద్యారెడ్డితో పాటు నిఖీష్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు విస్తృతంగా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పాలించిన చంద్రబాబునాయుడు ప్రజలకు ఏమి చేశారంటూ ప్రశ్నించారు. అభివృద్ధి కొనసాగాలంటే కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


బుడ్డేకల్ వీధిలో ప్రచారం చేస్తున్న గౌతమిరెడ్డి

టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం ఆమె కోడలు సాహితి పట్టణంలోని 27వ వార్డులో రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వార్డు ఇన్‌చార్జ్ కె.శివన్నతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగనన్న మంజూరు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దని, సంక్షేమ సారధి సీఎం జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుఖాన్, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే ముస్లింలకు నష్టమే


ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న మైనారిటీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల సంక్షేమాన్ని దెబ్బతీసే బీజేపీతో జతకట్టిన టీడీపీకి ఓటేస్తే నష్టమేగానీ ప్రయోజనం లేదని, ముస్లింల సంక్షేమానికి పాటుపడే వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు అధ్యక్షుడు, కౌన్సిలర్ ఖాశింబేగ్ కోరారు. సోమవారం ఉదయం పట్టణంలోని బిలాల్ మసీదు ప్రాంతంలో మైనారిటీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపుకోసం ముస్లింలను కలిసి విస్తృత ప్రచారం చేశారు. ముస్లిం రిజర్వేషన్లను కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలని, కుట్రల కూటమికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, హాజీ వహబ్, సయ్యద్ చాంద్, యుసఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని బరిలో పది మంది అభ్యర్థులు

ఆదోని రూరల్: ఆదోని అసెంబ్లీ బరిలో 10 మంది అభ్యర్థులు ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను ఆర్వో తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి – ఫ్యాన్, బీఎస్పీ అభ్యర్థి ఆసియాబాను అమ్లివాలే – ఏనుగు, బీజేపీ అభ్యర్థి పి.వి.పార్థసారథి – కమలం, కాంగ్రెస్ అభ్యర్థి జి.రమేష్‌యాదవ్ – హస్తం, జైభీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థి కె.రంగన్న – కోర్టు, స్వాతంత్ర అభ్యర్థులు వడ్డె ఉరుకుంద – ల్యాప్‌టాప్, జి.జయన్న – పండ్లబుట్ట, కె.దస్తగిరినాయుడు – వజ్రం, బి.నాగరాజు – యాపిల్, జి.యువరాజ్ – గ్లాస్ టంబ్లర్ గుర్తులు కేటాయించినట్లు ఆర్వో వివరించారు.

చేనేతపురిలో పది మంది పోటీ

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే స్థానానికి 10 మంది బరిలో నిలిచినట్లు ఆరో చిరంజీవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టారేణుక, టీడీపీ అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాశింవలి, బీఎస్పీ అభ్యర్థిగా కె.రాఘవేంద్రలతో పాటు జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె.నాగార్జున రెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గవ్వల నారాయణ, మిట్టి రాజశేఖర్, జగన్నాథ ఈరన్న, గొల్ల ఈరన్న, పి.విజయలక్ష్మిలు ఉన్నట్లు ఆర్‌ఓ తెలిపారు.

మంత్రాలయంలో అష్టముఖ పోటీ

మంత్రాలయం: మంత్రాలయం అసెంబ్లీ స్థానానికి 8 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ నుంచి వై.బాలనాగిరెడ్డి (ఫ్యాన్ గుర్తు), టీడీపీ అభ్యర్థి ఎస్.రాఘవేంద్రరెడ్డి (సైకిల్), కాంగ్రెస్ నుంచి మురళీ కృష్ణరాజు (హస్తం), బీఎస్పీ తరపున గుడిపి సామేల్ (ఏనుగు), జాతీయ జనసేన పార్టీ అభ్యర్థి ఆర్.రాఘవేంద్రరెడ్డి (పెన్‌స్టాండ్), స్వతంత్ర అభ్యర్థులుగా ఎం.రాఘవేంద్రరెడ్డి (ప్రెజర్ కుక్కర్), కురువ నాగిరెడ్డి (విజిల్), సి.పరమేష్ (ల్యాప్‌ట్యాప్) పోటీలో ఉన్నట్లు ఆర్‌ఓ వెల్లడించారు.